## శ్రీ శ్రీ రాయని కథః

# దుంపరాష్ట్రం

[1975 లో మహాకవి శ్రీశ్రీగారితో నా పరిచయం. కొన్నాళ్ళు,

ప్రతిరోజు సహజకవి మల్లెమాలగారి సదనంలో కలుసుకునేవాళ్ళం. అప్పుడప్పుడు శ్రీశ్రీగారిని అడుగుతుండేవాడిని. ఈమధ్య కొత్తగా కథ ఏమైనా రాశారా?– అని. లేదు అనేవారు తన మార్కుధోరణిలో సిగరెట్ త్రాగుతో, ఎక్కడో ఆలోచిస్తో

ఒకరోజు వున్నట్లుండి- కొత్తకథ మొదలుపెట్టాను- అంటూ చదివారు, కథపేరు దుంపరాష్ట్రం. మొదలుపెట్టి నాలుగు వాక్యాలు చదివారు. ఆ నాలుగు వాక్యాలే ఇప్పుడు సరిగ్గా నా ఈ కథకు ప్రారంభ సరిగమలు.

అంతే

ఆతరువాత వారు మళ్ళీ ముందుకు పోలేదు. ఏవండీ- అంటే, అంతవరకే రాశాను- ఆతరువాత రాద్దామనుకుంటున్నాను- రాస్తానో, లేదో- అన్నారు.

ఇంతలో-

చైనా పర్యటన కెళ్ళొచ్చారు. వచ్చిన కొత్తలో టూసన్ కథలు తెనిగించాలనుకుంటున్నట్లు చెప్పారు,

దుంపరాష్ట్రం ఏమయింది? అని అడిగాను. దాని దుంపతెగ అలాగే వుంది—అన్నారు సిగరెట్టు పొగలమధ్య సింహంలా తల విదిలిస్తూ. ఆ కథను నాకోసం మిగిల్చారేమో అన్న భావం నాలో తళుక్కుమంది. ఎలక్ట్రోమోటివ్ ఫోర్స్ సంతరించుకుని

అప్పటినుండి వారి మూసలో ఆకథను రాయాలని ఆరాటం. అందుకే ఇన్నాళ్ళకు మళ్ళీ ఆ అక్షరాలతో ఈ పోరాటం ]

అనగనగా ఒక రాష్ట్రం. దాని పేరు దుంపరాష్ట్రం ఆరాష్ట్రంలో రెండే పరిస్థితులు. ఒకటి అవసరపరిస్థితి, రెండవది అత్యవసర పరిస్థితి.

ఒకప్పుడు ప్రశాంతంగావుండి పంచాయితీ ఎలక్షన్ల ధర్మమా— అని. కక్షలూ, కార్పణ్యాలకు ఆలవాలమయిన దుంపరాష్ట్రంలోని పల్లెటూళ్ళలో కటకరేణిపల్లి ఒకటి.

ఆపల్లెలో-

ఈ దేశంలోని దరిద్రానికి మకుటంలేని మహారాజులా వున్నాడు పుల్లయ్య. కొంతమంది అతన్ని వుల్లిస్తర పుల్లయ్య అని కూడా పిలుస్తారు. కారణం- ఆఊళ్ళో ఏ ఇంట్లో పెళ్ళి జరిగినా, ఏ ఇంట్లో కర్మ జరిగినా- భోజనాల తర్వాత విస్తర్లు ఎత్తివేసే పనికి అతన్నే పిలుస్తారు. వాళ్ళమాట కాదనలేక, పట్టెడు అన్నం వదులుకోలేక ఆపనికి ఒప్పుకుంటాడు. అతని భార్యపేరు బిందెమ్మ. ఇలమీద ఏం జరిగినా అంతా దైవలీల- అని నమ్మే అపర హిందూ ధర్మపత్ని. వారికి ఇద్దరే సంతానం, ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. ఆతర్వాత ఓపికలేకనో, దరిద్రానికి తలవొగ్గో- కనడం మానేశారు.

అమ్మాయి పెద్దది. పేరు లవంగం. చిదిమిదీపం పెట్టొచ్చు. అంత అందంగా వుంటుంది.

అబ్బాయ్ శొంఠి అందరూ శొంఠోడు అంటూరు. పెద్ద బళ్ళో చదువుకుంటున్నాడు.

అవాళ—

లోకంలోని శోకమంతా వాళ్ళను ముంచేసినట్టు కుప్పకూలిపోయి వున్నారు- వెలిసిపోయి, గోడల మొదట్లలోనే రాలిపోయిన మట్టిపెళ్ళల్లా.

అసలేం జరిగిందంటే—

పట్నాలలో చదువుకుంటూ సెలవులకు ఇళ్ళకొచ్చిన కామాంధుల పిల్లకాయలు తప్పతాగి, వయసుకొచ్చిన లవంగిని వాటేసుకున్నారు పక్క నున్న ఇంట్లోకి లాక్కెళ్ళి, నోట్లో గుడ్డ కుక్కి ఒక్కరొక్కరే కాటేసి వెళ్ళారు. కూటికోసం కూలికెళ్ళిందేకాని, కూలికిపోతే అలా మానం పోతుందని కల్లోకూడా అనుకోలేదు కామోసు, లవంగి- ఆ కామాంధుల సామూహిక రాక్షస రతిని తట్టుకోలేక- అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది.

ఏరు చూసింది, ఏట్లో నీరు చూసింది, చెట్లు చూశాయి, చెట్లపై పక్షులు చూశాయి, ఆకాశం చూసింది, అక్రింది మేఘాలు చూశాయి-

నోరున్న మనుషులు చేసిన ఆడ కూతురుపై ఆ అఘాయిత్యాన్ని, నోరులేని అవి ఏవీ నిరోధించలేక పోయాయి. దేశాన్ని మాతగా గౌరవించే ఈ పుణ్య భూమిపై మానభంగానికి గురైన ఆకన్నె ప్రాణాలు నిలపెట్ట లేకపోయాయి.

ప్రభుత్వముంది, పోలీసులున్నారు, న్యాయస్థానాలున్నాయ్- కానీ, యిలాంటి అమానుషాలు ఎన్ని బుట్ట దాఖలా కావడంలేదు, మట్టిదాఖలా కావడంలేదు.

దుంపరాష్ట్రం ఎందుకంత దిగజారి పోతోంది?

పైగా నా రాష్ట్రంలో శీలం దిగజారి పోతోందని దుంప దుంప నాయకుల గంపల గంపల ఉపన్యాసాలు సాగుతున్నాయి మరి?

ఆ సంఘటనకు శొంఠోడు చలించిపోయాడు. మనసు జ్వలించి పోయింది.

ఇదే మన్యాయం? అని అడగబోయిన శాంతోణ్ణి కుందినట్టు కొట్టారు ఊళ్ళోవాళ్ళు

పొయ్యి దగ్గర మూలుగుతూ పడివున్నాడు, పొయ్యి రాజెయ్యలేదు.

శాంతోడు గుండె మాత్రం రగులుతూవుంది. సెగలు చిమ్ముతూ వుంది.

కన్నకూతుర్ని వాళ్ళ పొట్టన పెట్టుకున్నందుకు చిందెమ్మ కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది.

అయ్యా! మీపట్ల నేనేం అపరాధం చేశాను? అన్నధోరణిలో ఎదుటికొచ్చి, చేతులు కట్టుకున్న పుల్లయ్యతో "చూడు పులిగా! నువ్వారికే ఇదవ్వకు. పైవాళ్ళంతా మావాళ్ళేనని నీకు మళ్ళా వేరే చెప్పాలా? నువ్వు మాకు కావల్సినోడివి మేము నీకు కావల్సినోళ్ళం. ఇదేం ఒకనాటితో పొయ్యేదా?? ఏదో పిల్లకాయలు ఆశపడ్డారు. అంతమాత్రానికే ఏదో కొంప మునిగినట్టు లవంగి నానా హైరానా పడిపొయ్యి హరీమంది. పొయ్యినపిల్ల మళ్ళా వస్తాదా? జరిగింది జరిగిపోయింది, ముందు జరగాల్సింది చూడు" అనిచెప్పి లవంగిని పూడ్వనివ్వకుండా, దగ్గరుండి కాల్పించారు- పెదకామందులు, దూరదృష్టితో.

---

ఆ ఊర్లో పార్టీలుకూడా రెండే!

ఒకటి తలగుడ్డలు మార్చే పార్టీ-

రెండు: ఇళ్ళల్లో దీపాలు మింగేసే పార్టీ-

ఆ ఊళ్ళో ఎవరైనా కామంధులకు ఎదురు తిరిగారని తెలిస్తే- వాడికీ, వాడి పక్కింటివాడికీ ఏదో ఒక రకంగా వ్యవహారం పెట్టడం- అలా ఎదురు తిరిగినవాళ్ళను మధ్యస్తం పేరుతో తలమీద కొట్టడం, లొంగదీసుకొని, దాసోహమనిపించుకోవడం- ఆమనస్తత్వంగల వాళ్ళంతా ఒక ముఠాగా ఏర్పడి, దానికి త. గు. మా. పార్టీ అని పేరు పెటుకున్నారు ముద్దుగా. తగుమాలోని అంతరార్థం వాళ్ళ అంతరంగాలకు మాత్రమే తెలుసు అందుకే వాళ్ళు అంతరంగాన్నే నమ్ముకున్నారు.

రెండో రకానిది మరోపద్ధతి-

ఎవడైనా పేదవాడు కాస్త సంపాదించుకొని, పచ్చగావుంటే- వాడితో, వాడి కుటుంబంతో స్నేహంగా వున్నట్టు అగుపించి, వాడి ఆస్తిని కాజేసి, వాడింట్లో దీపాన్ని ఆర్పేయడం, వాడి జీవితంలో వెలుగును మింగేయడం, వాణ్ణి శాశ్వతంగా తమకింద వుండేటట్లు చేసుకోవడం. అవసరమైతే ఈ విషయంలో ఆడవాళ్ళను కూడా అడ్డం పెట్టడం అమనస్తత్వంగల వాళ్ళందరూ ఒక ముఠాగా చేరి ఇ దీ. మి. పార్టీని స్థాపించుకున్నారు.

లవంగి విషయంలో ఈ ఇరుపార్టీలకు చెందినవారు ఒకటయ్యారు. వాళ్ళ మధ్య విభేధాలను విస్మరించారు. కారణం ఇరుపార్టీల పిల్లలూ ఈ కామ దహనంలో వున్నారు కనుక.

పులిగాడు నోరు మెదపలేక పొయ్యాడు కామందులు చెప్పినట్లు చేసి చేతులు కడుక్కున్నాడు.

ఇప్పుడు కుమిలి కుమిలి ఏడిస్తే, కూతురొస్తుందా?

ఏడవంది ఒక్క శొంఠోడు మాత్రమే!

ఎక్కడో చూస్తున్నాడు, ఏదో ఆలోచిస్తున్నాడు-

దూరంగావున్న పట్నం పోవాలనివుంది. పోలీసులకు చెప్పాలని వుంది. కటికరేణిపల్లికి పోలీసులొస్తే- పెదకామందు ఇంట్లోనే దిగుతారు అక్కడికే అందర్నీ పిలిపించుకుంటారు. అందరూ చెప్పింది వింటారు. అన్నీ రాసుకుంటారు. చివర్లో పెదకామందు వంక చూస్తారు.

అంతే

ఆ తర్వాత ఏం జరుగుతుంది?

ఏం జరుగుతుందో శొంఠోడికి తెలుసు.

పెదకామందు ముందు పార్టీలో ఏం చెబితే అదే జరుగుతుంది. అంతే జరుగుతుంది.

శొంఠోడు ఉలిక్కిపడ్డాడు.

మర్రోజు మళ్ళీ ఊళ్ళోవాళ్ళ మీదకి పోయాడు శొంఠోడు పిచ్చి పట్టిన వాడిలా

పెదకామందు కూతుర్ని చెయ్యిపట్టుకొని లాగి, పరాభవం చెయ్యబోయాడు అంతలోనే కొందరు వాణ్ణి అడ్డుకొని దొంగపోట్లతో స్పృహ తప్పి పడిపోయే వరకు కొట్టారు కొట్టికొట్టి కుక్కలకు నెత్తురు పోశారు.

ఊళ్ళో వెంటనే అవసర పరిస్థితిని ప్రకటించారు.

పసివాడు శొంఠోన్ని ఏదో శోధించినట్లయింది. పులిగాణ్ని పిలిచి మందలించారు పెద్దోళ్ళు

అంతేగాదు

పెద్దోళ్ళ మాట పెడచెవిని పెట్టి, వాళ్ళను నానా బూతులు తిట్టినందులకు, పెదకామందుగారి అమ్మాయిగారిని చెయ్యిబట్టి లాగి అవమానించినందుకు ఆదివారం ఉదయాన కమిటీముందు శొంఠోన్ని పెడరెక్కలు విరిచి, చెట్టుకు కట్టేసి, కొట్టాలని నిర్ణయించారు.

వాడు బతికితే అపాయం అనుకున్నారో ఏమో?

"పసోడు వాడికేం తెలవదు. ఈ సారికి వొగ్గేయండి దొరా!" చేతులెత్తి మొక్కి చెంపలేసుకున్నాడు పుల్లయ్య

వాడి మొరను ఎవరూ ఆలకించలేదు

"పిల్లకాకేక్కేం తెలుసు ఉండేలుదెబ్బ పడగెత్తిన పామును పాపం అనకూడదు కోరలు పీకెయ్యాలి" అన్నారు పెద్దమనుషులు ఒక్కుమ్మడిగా

ఎన్నోసార్లు చెప్పాను శిన్నోడా? వాళ్ళు మహారాజులు మనం పేదోళ్ళం. మనం పుట్టింది వాళ్ళ చాకిరీ చేసుకొని బతకడానికి ఇంతకూడు పెట్టినావాళ్ళే మన కూతుళ్ళను చెరిచినా వాళ్ళే. పెంచినా చంపినా వాళ్ళకు ఎదురు తిరగగూడదని ఎన్నోసార్లు చెప్పాను. ఏలిడి త లేదు ఈడికెందుకు? అసలు ఉడుంకెందుకు ఊళ్ళో పెత్తనం?

కన్నతండ్రి హృదయం ఆక్రోశించింది

శాంతోడు మాత్రం మౌనంగా వున్నాడు. తండ్రి మాటలను మౌనంగా విన్నాడు.

వాడి ఒళ్ళు కాలిపోయింది

వాడి కళ్ళు కణకణమండే నిప్పుల్లా వున్నాయ్ తల్లి బావురుమంది. కొడుకుని కౌగలి చుకొని

*   *   *   *

ఆదివారం వచ్చింది

జగచ్చక్షువూ వచ్చాడు

ఉదయాన్నే ఊరిపెద్దలందరూ శ్రీరాములవారి మందిరం దగ్గర అత్యవసర సమావేశానికి హాజరయ్యారు.

ఇదీమి పార్టీ (ఇళ్ళలో దీపాలు మింగేసే పార్టీ) వాళ్ళ దరూ సమావేశ మయ్యారు. కానీ తగుమా పార్టీ (తలగుడ్డలు మార్చే పార్టీ) వాళ్ళు ఇంకా సగానికి పైగా రాలేదు. ఎక్కడ వెంటనే తలగుడ్డలు మార్చే అవకాశం. వచ్చిందో?

పులిగాణ్ని బిందెమ్మను, శాంతోణ్ని పిలిపించారు.

కటకరేణిపల్లి జేవురించింది.

అప్పటికే ఊళ్ళో జనమంతా అక్కడ పోగయ్యారు. సాటి మనిషిని చెట్టుకు కట్టేసి, కొడదామ టే ఎంత ఆనందమో, ఎంత ఆతృతో వాళ్ళకు

అహింసను ప్రబోధించిన బాపూజీకి వారసులు గదావాళ్ళు

బీదాబిక్కి దూరదూరంగా బిక్కు బిక్కుమంటూ చమురులేక ఆరిపోతున్నా దీపాల్లా, ఎండిపోయి బిగుసుకు పోయిన ఎముకల్లా నిలుచుని చూస్తున్నారు భయాన్ని కక్కుతున్న వారికళ్ళు చెబుతున్నాయి.- వాళ్ళలో జీవం వుందని, మహారాజులకు ఎదురు తిరిగితే తమకూ శాంతోడికి పట్టిన గతే పడుతుందనే పాఠం నేర్చుకోవడానికి వచ్చిన వాళ్ళని

రాత్రి నుండి శొంఠోడికి చలి, జ్వరం నిండుగా దుప్పటి కప్పుకొని నిలుచుని ఉన్నాడు.

ఓ పక్కగా పులిగాడు, బిందెమ్మ నిలుచుని వున్నారు నేరస్తుల్లాగా?

నెత్తురు దొరుకుతుందేమోనని ఊరకుక్కలు ఆశగా చూస్తూ అటూ యిటూ తిరుగుతున్నాయి. మనుషులు తలుపులు తీస్తే తప్ప, వీధిముఖం చూసే అదృష్టానికి నోచుకోని శ్రీరాముడు గర్భగుడిలో నిర్భయంగా వున్నాడు.

ఇక రావలసిన పెద్దమనుషుల కోసం ఆగక, విచారణ ప్రారంభించాడు పెద్దకామందు

అడివిలో సాదు జంతువులను వేటాడి వేటాడి చంపి, వాటి మాంసాన్ని పుష్టిగా తిని, రక్తాన్ని తృప్తిగా త్రాగి విలాసంగా విశ్రాంతి తీసుకుంటున్నట్టు మిగిలిన గ్రామ పెద్దలు బారులు తీరి కూర్చుని వున్నారు.

అది ఊరుకానట్టు, పెద్ద కీకారణ్యం అయినట్టు శొంఠోడి దృష్టికి అక్కడ కూర్చొన్నవారు ఒక్కొక్కరు పులి, ఎలుగుబంటి, తోడేలు, నక్క రేసు కుక్కల్లా వికృత మృగాల్లా కనిపిస్తున్నారు.

తను, నాన్న అమ్మ లవంగాన్ని ఆ మృగాలకు ఎరచేసి, వాటి మధ్య చిక్కుకొని పోయివున్నట్లు అనిపించింది.

పులి ఇన్నాళ్ళూ అందరి రక్తం తాగినా దాహం తీరనట్టు ఎర్రగా నోరు తెరిచి. నాలుక చాచి అడిగింది. "ఏరా శొంటోడా నీకు వొళ్ళు కొవ్వెక్కిందా? తిన్నదరగడం లేదా? కళ్ళు కనిపించడం లేదా? ఎంత పొగర్రానీకు? ఎన్ని గుండెల్రానీకు? దొంగనాకొడక, నీలోక్కొనుండావ్??

"ఆపు ఆగ్రహంగా అదిలించాడు శొంటోడు"

"నేను నీకొడుకుని కాదు, పుల్లయ్య కొడుకుని" అందుకే అడుగుతున్నాను. ముక్కుపచ్చలారని మా అక్కను చెరిచి, ఎందుకు దారుణంగా చంపేశారు?

ఆ విషయం మేం అడక్కూడదు  అందుకు సంబంధించిన విచారణ అసలే లేదు  మీరేంచేసినా, మీరెన్ని కొట్టినా మేం మాట్లాడకూడదు మాకన్న తల్లులు, మా అక్కచెల్లెళ్ళూ ఆడవాళ్ళు కాదు  మీ దృష్టిలో ఆడుకునే కీలుబొమ్మలు- మీ తల్లులు, మీ పెళ్ళాలు, మీ కూతుళ్లు మాత్రం పరమ పతివ్రతలు– దొంగనాకొడకల్లారా! మీరు పెద్ద మనుషులా? మీరు పల్లెల్ని పరిపాలించే ప్రభువులా? మీబిడ్డలైతే ఓ న్యాయం, మా బిడ్డలైతే మరో న్యాయమూ నాముండమోపుల్లారా, మృగాల్లారా అంటూ ఆవేశంగా కడుపు మంటతో బూతులు అరవసాగాడు.

ఉద్వేగపడుతున్న కొడుకుని వారించబోయాడు పులిగాడు.

"పట్టుకోండిరా నాకొడుకుని ఈడెమ్మ నవరంధ్రాలూ మూసేయండి. ప్రాణాలు తీసేయండి అంటూ హుంకరిస్తూ పైకి లేచింది పులి."

మిగిలిన మృగాలన్నీ భీకరంగా పైకి లేచాయ్.

"ఆగండి గర్జించాడు శొంటోడు"

అందరూ ఒక్క అడుగు వెనక్కు వేశారు. శొంటోడు కప్పుకొని వున్న దుప్పటి జారిపోయింది.

అతని చేతుల్లో

వందల బులెట్ల బెల్టువున్న మరతుపాకికూడా దృఢంగా గర్జించింది.

నిప్పులు కక్కింది.

ప్రతి బుల్లెట్లోనూ లవంగి సివంగిలా ముందుకు దూసుకు వచ్చింది.

పులితోసహా కొన్ని మృగాలు అక్కడికక్కడే నేలకొరిగాయి  ఈ హఠాత్పరిణామాన్ని ఊహించని కొన్ని మృగాలు బెదిరిపోయి చెల్లా చెదురుగా పారిపోసాగాయి.

పకపకా నవ్వుతున్నాడు శొంటోడు.

పుట్టిన తరువాత అంత నిండుగా ఎప్పుడూ నవ్వలేదు.

నవ్వుతూ, నవ్వుతూ క్షణంలో తుపాకిని తన వైపుకు గురిపెట్టుకొని, ట్రిగ్గర్ నొక్కాడు అలాగే నేలకొరిగాడు, రక్తాభిషిక్తుడయి పారిపోతున్న మృగాల్లో ఒక మృగం వెనుదిరిగి చూసింది.

ఆకాశంలోని సూర్యుడు ముక్కలై కుప్పగా భూమ్మీద పడ్డట్టు కనిపించింది. రక్తపు మడుగులోని శొంటోడి శవం! బిందెమ్మ ఆశ్చర్యం లోంచి తేరుకునేలోగా ఊళ్ళోవాళ్ళు కత్తులు, కటార్లు, గండ్రగొడ్డండ్లు, బరిసెలూ ఎత్తుకొని పరుగెస్తూ వున్నారు, శొంటోడిలో యింకా కొస ప్రాణం మిగిలిందేమోనని

మెరుపు తీగెలా ముందుకురికిన పుల్లయ్య, శొంటోడి కళేబరాన్ని జవిరి భుజాన వేసుకున్నాడు మరి తుపాకిని కొడుక్కంటే నేర్పుగా పట్టుకొని, వచ్చే దౌర్జన్య వర్గానికి గురిపెట్టాడు.

అంతే

ఎక్కడివాళ్ళు అక్కడే ఆగిపొయ్యారు, శిలా ప్రతిమల్లా.

మతిపోయినట్లయింది, బిందెమ్మకు భర్త ఉగ్ర స్వరూపాన్ని చూసి, "మీరు మీరు" అందినోట ఆపైన మాట రాక

"నేనే లేవే వులిగాణ్ణి శొంటోడు చంటోడు- ఆపుకోలేక పొయ్యాడు. తొందరపడ్డాడు. గుడిసెలో దాచిన ఈ తుపాకిని ఎప్పటినుంచి మచ్చిక చేసుకున్నాడో? ఆలస్యం చెయ్యకు. పద" అనగానే బిందెమ్మ ఊరికి వ్యతిరేక దిశలో తిరిగి నడవసాగింది. వడివడిగా కొడుకు శవాన్ని భుజాన వేసుకుని, తుపాకిని ఊరివైపు గురిపెట్టి భార్యను అనుసరించాడు పులిగాడు.

నభో మండలంలో జగజ్జేయ గేయమానంగా ప్రజ్వలిస్తున్న ప్రభాత సూరీడు ఎర్రగా ఇంకొంచెం పైకి ఎగబాకి వాళ్ళకు స్వాగతం చెప్పాడు.

వెంటనే దుంపరాష్ట్రం అంతటా అత్యవసర స్థితిని ప్రకటించారు.

[ఈ కథ మహాకవి శ్రీశ్రీకి అంకితం రచయిత]